ప్రజాశక్తి
శనివారం 1 ఫిబ్రవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



రైల్వే జోన్‌కు నిధులు రాలేనా?

◆ మెట్రో రైల్ ముందుకు కదిలేనా! ◆ విభజన హామీలను విస్మరించిన పాలకులు
◆ విశాఖ స్టీల్ రోజువారీ నడకకు నిధుల మాటేమిటి? ◆ నేడే కేంద్ర బడ్జెట్ -2025

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎపి విభజన చట్టం అమలును పూర్తిగా అటకెక్కించేశారు. విశాఖ జిల్లాకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని కరాఖండిగా అడిగిన దాఖలా లేవు. దీంతో రావాల్సిన ప్రాజెక్టులు రాకుండానే మూలనపడిపోతున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. విశాఖను ఐటి రంగంలో అభివృద్ధి చేసేందుకు ఎన్నో అవకాశాలున్నా చెప్పుకోదగ్గ పరిశ్రమ ఏదీ ఇంతవరకూ రాలేదు. విభజన హామీల్లో ఇదో ప్రధాన మైన అంశంగా ఉంది. దీంతో నిరుద్యోగ యువతకు పాలకుల హామీలు ఆశనిపాతంలా మారిపోయాయి.

రైల్వే ప్రాజెక్టులు ముందుకు సాగాలంటే...

కేంద్రంలోని మోడీ సారథ్యంలో మూడోసారి 2024 ఎన్నికల్లో దేశంలో అధికారం చేపట్టిన తర్వాత 8వ సారి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం లోక్‌సభలో 2025 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమైన విభజన చట్టం అమలు, కేంద్రం ఇవ్వాల్సిన నిధులు, విశాఖకు రావాల్సిన ప్రాజెక్టులపై తాజాగా చర్చ జరుగుతోంది. ఈ ఏడాది జనవరి 8న విశాఖకు వచ్చిన ప్రధాని మోడీ ఎయు గ్రౌండ్‌లో సభావేదిక నుంచి రైల్వే జోన్ (సౌత్ కోస్ట్)కు పునాదిరాయి వేశారు. రూ.149కోట్లు దీనికి అవసరం కాగా ఇంతవరకూ నిధులేమీ రాలేదు. జోనల్ మేనేజర్ పోస్టును కూడా ఇంతవరకూ భర్తీ చేయలేదు. కార్యాలయ నిర్మాణ పనులు ముందుకు సాగాలంటే కనీసం రూ.50కోట్లు అవసరం అని రైల్వే ఉన్నతాధికారులు చెబుతున్నారు. నిర్మలా సీతారామన్ ఎంత నిధులు సమకూర్చుతారన్న ఆశ స్థానికుల్లో ఉంది. కొత్త రైళ్ల డిమాండ్ విశాఖ ప్రాంతం నుంచి ఉంది. వందేభారత్ రైలు మరొకటి విశాఖకు ఇస్తామని కేంద్రం ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో అవకాశం ఉంటుందా? చూడాల్సిందే. రైళ్లు ఒకదానికొకటి ఢీ కొట్టకుండా కవచ్ వ్యవస్థను పటిష్టపరచాల్సి ఉంది.

మెట్రో పరుగులు తీసేనా?

మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రూ.17వేల కోట్ల నిధులు అవసరం కాగా ఇంతవరకూ ఒక్కపైసా విడుదల కాలేదు. కార్యాలయం విశాఖ ఎల్ఐసి కార్యాలయ సముదాయం వెనుక భాగంలోని ఆర్ఐఎన్ఎల్ ప్రాంగణంలో అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. కొంతమంది మెట్రో రైల్ కోసం పనిచేసే సిబ్బంది మాత్రమే ఇక్కడ ఉన్నా మెట్రో ప్రాజెక్టు సందిగ్ధంలో పడడంతో ఈ కార్యాలయం ఉంటుందా? ఊడుతుందో నేటి బడ్జెట్‌లో నిధుల కల్పనతోనే వెల్లడవుతోంది.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిస్థితి...

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11400కోట్లు ప్యాకేజీ ప్రకటించినప్పటికినీ 4 నెలలుగా సక్రమంగా అందని జీతాలకు మాత్రం ఒక్కపైసా విదిలించలేదు. కేంద్ర ఉక్కు మంత్రుల ముందు కార్మికులు గురువారం నాటి పర్యటనలో కార్మిక సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ ప్రభావం ఎలా ఉండబోతుందో నేటి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలమ్మ విదిలించే నిధులను బట్టి ఉంటుందన్న చర్చ నడుస్తోంది. 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లకుగానూ 1 మాత్రమే నడుస్తోంది. మిగతా 2 పనిలోకి రావాలంటే రూ.7వేలకోట్లకుపైగా అవసరం ఉంటుంది. రోజువారీ ప్లాంట్ నిర్వహణకు నిధులు లేకపోవడంతో సంక్షోభం ఇక్కడ కొనసాగుతోంది. కేంద్రం ఇచ్చిన ప్యాకేజీతో ప్లాంట్ అప్పులకే సరిపోదు.

గ్రేహౌండ్స్ కార్యకలాపాల విస్తరణ కోసం...

గ్రేహౌండ్స్ కార్యాలయం కోసం జిల్లాలోని ఆనందపురం మండలం జగన్నాథపురం గ్రామ పరిధిలో ఏర్పాటుకు 2021లో అంగీకరించారు. కేంద్రం అనేక మెలికలతో ఈ ప్రాజెక్టు పనులు ముందుకు మిగతా 2లో..

నేటి నుంచి

రిజిస్ట్రేషన్ ఛార్జీల బాదుడు

23 నుంచి 34 శాతం పెంపు



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ఛార్జీలు శనివారం నుంచి పెరగనున్నాయి. కూటమి ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు సబ్ రిజస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని కొన్ని గ్రామాల్లో భూముల విలువ పెంచింది. రిజిస్ట్రేషన్ విలువ కనీసం 23 శాతం నుంచి గరిష్టగా 34 శాతం పెంచారు. మాడుగుల, నక్కపల్లి సబ్ రిజస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని ప్రస్తుత మార్కెట్ విలువకు అదనంగా 34 శాతం చొప్పున ఛార్జీలు పెంచి సవరించారు. ఈ పెరుగుదలతో రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల ఆదాయం అదనంగా ప్రభుత్వానికి సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. చోడవరం రిజస్ట్రార్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా 132 గ్రామాల్లో స్థిరాస్తుల విలువ పెరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్థిరాస్తుల క్రయ, విక్రయ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మార్కెట్ విలువను జిల్లా స్థాయిలో అధికారులు కసరత్తు చేసి సవరించారు. అనకాపల్లి ప్రాంతంలో ఆశించిన స్థాయిలో విస్తరణ లేకపోవడంతో రిజిస్ట్రేషన్ విలువ పెంచలేదు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు శనివారం నుంచి పెరగడంతో శుక్రవారం సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. ఛార్జీల భారం పడకుండా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

సబ్ రిజస్ట్రార్ కార్యాలయాల వారీగా పెరుగుదల

సబ్‌రిజస్ట్రార్ కార్యాలయం	గ్రామాలు	పెంపుశాతం
అనకాపల్లి	75	24
చోడవరం	132	25
కె.కోటపాడు	62	32
కోటవురట్ల	77	23
లంకెలపాలెం	32	27
మాడుగుల	65	34
నక్కపల్లి	66	34
నర్సీపట్నం	87	25
సబ్బవరం	49	32
యలమంచిలి	84	31

బిజెపితో ప్రజాస్వామ్యం ఖూనీ : డి.రాజా
▶ వార్త మెయిన్‌లో..

నిరాశ మిగిల్చిన కేంద్ర ఉక్కు మంత్రుల పర్యటన
▶ వార్త మెయిన్‌లో..

మహిళా కార్మికుల పోరాటంతో దిగొచ్చిన బ్రాండిక్స్
▶ వార్త 5లో..

సూపర్ సిక్స్ అమల్లో ప్రభుత్వ విఫలం : బొత్స, అంబటి
▶ వార్త 5లో..

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో మార్చి 1 నుంచి జరగబోవు ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు, జిల్లా కలెక్టర్ దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో పర్నిచర్, విద్యుత్, మరుగుదొడ్ల ఏర్పాట్లపై అధికారులనడిగి తెలుసుకున్నారు. సమస్యలేమైనా ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని తెలిపారు.

జిల్లా పోలీసు శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి, బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 200 మీటర్ల దూరంలో ఉన్న జెరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర మందులతో పాటు వైద్య సిబ్బంది విధులు నిర్వర్తించేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్ విధివిధానాలు, ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలు తరలింపులు తదితర అంశాలపై ఆయా శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సమయానికి చేరుకునేలా ప్రణాళిక బద్ధంగా ఆయా రూట్లలో బస్సులు ఏర్పాటుచేయాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఐఒ పి.మురళీధర్, డివిఇఒ బి.రాధ, పోలీస్, జివిఎంసి, వైద్య ఆరోగ్య శాఖ, ఎపిఎస్ఆర్‌టిసి, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచగ్రామాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పంచగ్రామాల భూ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకటరావు, యు.రాజులతో కలిసి శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించడం శుభ పరిణామం అని, దీనిని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గతంలో కూడా ప్రభుత్వాలు వివిధ సందర్భాలలో పరిష్కరించే చర్యలు చేపట్టినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు సరికదా, మరింత జఠిలం అయిందని తెలిపారు. 2019లో ఈ సమస్యపై అసెంబ్లీలో చంద్రబాబు ప్రభుత్వం ఒక చట్టమే చేసి, జిఒ కూడా ఇచ్చిందని గుర్తుచేశారు. గతంలో రాజశేఖరరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు కూడా అనేక కమిటీలు వేశాయని, జిఒ లిచ్చినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మొత్తం భూమిపై ఏ హక్కులూ లేని సింహాచలం దేవస్థానానికి 1996, 97లో నాటి పెందుర్తి, చినగదిలి తహశీల్దార్లతో 9068 ఎకరాల భూమికి పట్టాలు ఇప్పించడం ద్వారా లేని సమస్యను గత చంద్రబాబు ప్రభుత్వం సృష్టించిందన్నారు. ఈ పట్టాలు చెల్లవని, హైకోర్టు ఆదేశానుసారం విశాఖ ఆర్‌డిఒ కోర్టులో కొన్ని నివాస సంఘాలు వేసిన కేసులో 2010 ఏప్రిల్ 3నఈ మొత్తం భూములపై సర్వే చేయాలని తీర్పు వచ్చిందన్నారు. ఇప్పటివరకు ఆ తీర్పు అమలు కాలేదని తెలిపారు. 2014లో అదే ప్రాతంలోని వేరే భూసమస్యపై సిపిఎం హైకోర్టులో కేసు వేయగా, దీనిపై సమగ్ర విచారణ జరిపేలా ఉన్నతాధికారుల కమిటీ వేయాలని, ఆరు నెలల్లోగా తమకు నివేదిక సమర్పించాలని కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం జాయింట్ కలక్టర్, సిసిఎల్ఎ సర్వే, సెటిల్మెంట్ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల ఉన్నతాధికారుల కమిటీని నియమించిందని తెలిపారు. ఆ కమిటీ నివేదికలో ఈ పట్టాలు సక్రమం కాదని, 1903 గిల్మన్ సర్వే ఆధారంగా దేవస్థానికి 560.02 ఎకరాల భూమిపై మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రైల్వే జోన్‌కు నిధులు రాలేనా?

సాగలేదు. రూ.385 కోట్ల భూ వ్యయంతో 2022లో కేంద్రానికి ప్రతిపాదన పంపారు. ఈ బడ్జెట్‌లో నిధులొస్తేనే ఇక్కడ పనులు ప్రారంభం అయ్యేది..

ప్రజల డిమాండ్లపై బడ్జెట్ కరుణ చూపేనా?

ప్రజల కొనుగోలు శక్తి పెంచుతుందా? పడిపోయేలాగ బడ్జెట్ చేస్తుందా? అన్న ఆసక్తి సర్వత్రా కనిపిస్తోంది. బంగారం ధరలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్నాయి. బడ్జెట్‌లో పసిడి ధరలు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. వేతన జీవులకు శుభవార్త నిర్మలమ్మ చెబుతారా? ఆదాయ పన్నుదారులకు ఊరట లభిస్తుందా? వేచిచూడాల్సిందే.

పంచగ్రామాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

_మాత్రమే ఆధారాలున్నాయని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై కూడా ప్రభుత్వాలు నేటికీ ఏ చర్యా తీసుకోలేదన్నారు. హైకోర్టు ఈ సమస్యపై తన వద్ద ఉన్న 44 కేసులపై 2017 జూలై 24న న ఒక ఉమ్మడి తీర్పును ఇస్తూ, విశాఖ ఆర్‌డిఒ చెప్పిన విషయం సరైనదేనని తెలుపుతూ, మొత్తం భూములపై విచారణ జరపమని స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ (ఇనామ్స్) ను ఆదేశించిందని, అయితే అది కూడా అమలు కాలేదని తెలిపారు. 1996లో వేసిన హౌస్ కమిటీ సిఫార్సులను కూడా చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.

సమస్యను పరిష్కరించే దిశలో అధికారుల సూచనలనే ప్రభుత్వాలు పరిగణిలోకి తీసుకోలేదన్నారు. అదే సందర్భంలో ఈ సమస్య వల్ల ఇబ్బందులు పడుతూ, హైకోర్టులో వివిధ కేసులు వేసిన కక్షిదారులు, ఆ సంఘం, రైతులతో గానీ ప్రభుత్వం చర్చించడం గానీ, వారి అభిప్రాయాలూ తీసుకోవడం గానీ చేయకుండా ఏకపక్షంగానే నిర్ణయాలు చేస్తూ వస్తోందన్నారు. ఈ రెండు కారణాల వల్లనే నేటికీ సమస్య పరిష్కారం కాకుండా జరిలం అవుతోందన్నారు. దీని వల్ల అమ్మకాలు, కొనుగోలు నిలిచిపోయాయని, ప్రభుత్వం కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయిందని, అభివృద్ధి ఆగిపోయిందని, ప్రజల కష్టాలు పెరిగాయని చెప్పారు. పేదల ఇళ్ళ మరమ్మత్తులకు నోచుకోలేదన్నారు. అధికారుల వేధింపులు పెరిగిపోయాయని తెలిపారు.

ఇళ్ల స్థలాలు, భూమిపై అసలు యాజమానులుగా ఉంటూ, అన్ని రికార్డులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్న వీరందరిని తిరిగి ఆక్రమణదారులుగా ప్రభుత్వం ముద్ర వేసిందన్నారు. పేదలకు ఉచితంగా పట్టాలిచ్చే విధంగా వీరికి కూడా క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ పరిష్కారాన్ని హైకోర్టు ఆమోదించాలన్నా, కేసులలోని కక్షిదారులను సంప్రదించకుండా చేయదని తెలిపారు.

ప్రభుత్వం ఈ సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించాలని, అధికారుల చెప్పిన సూచనలను ప్రామాణికంగా తీసుకోవాలని, రైతు, నివాసిత, ప్రజా సంఘాలతోనూ, హైకోర్టులో కేసుల కక్షిదారులతో చర్చించాలని సూచించారు.



ఎంవిపి.రైతు బజార్‌లో మాట్లాడుతున్న షేక్ యాసిన్

ఎంవిపి రైతుబజార్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

ఎంవిపి రైతు బజార్‌లో విశాఖపట్నం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బజార్‌లోని రైతులు, డ్వాక్రా, పిహెచ్‌సిలతో సమావేశమయ్యారు. రైతుబజార్‌లోని కూరగాయలు, వస్తువులను ఉదయం 10 గంటలలోపు హోటళ్లకు, మారు వర్తకులకు ఎక్కువ మొత్తంలో అమ్మరాదని, అలా చేస్తే గుర్తింపు కార్డులను రద్దు చేస్తామని హెచ్చరించారు. సబ్జీ కూలర్ పనితీరుపై రైతులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కె.వరహాలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకు 5న కార్మిక ప్రదర్శన

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 5వ తేదీన భారీ నిరసన ప్రదర్శన చేపట్టాలని పిలుపునిచ్చాయని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ఆ పిలుపులో భాగంగా 5వ తేదీన జిల్లాలో పెద్ద ఎత్తున కార్మికులు నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చాలని ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. సంఘం పెట్టుకొని హక్కు, సమ్మె చేసే హక్కు, యజమానులతో జీతభత్యాలు బేరం ఆడే హక్కు వంటివి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసే మానిటైజేషన్ ఆఫ్ పైప్ లైన్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.9 వేలకు తక్కువ లేకుండా చెల్లించాలని తదితర డిమాండ్లతో దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలన్నీ ఈ ప్రదర్శనకు పిలుపునిచ్చాయని తెలిపారు. విశాఖలో ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరగనున్న నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. అన్ని పరిశ్రమల వద్ద, కార్మికుల పని ప్రదేశాలలోనూ నిరసనలు తెలపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు వ్యక్తిగతమా? పార్టీ విధానమా?

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : షెడ్యూల్ ఏరియాలో టూరిజం అభివృద్ధికి 1/70 చట్టం అడ్డంగా ఉందని చట్టం సవరించాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమా లేక పార్టీ విధానమా వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు సోనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్ డిమాండ్‌చేశారు. ఎంవిపి కాలనీలోని గిరిజన్ భవన్‌లో శుక్రవారం ఆదివాసీ ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1/70 చట్టం రక్షణకు అన్ని గిరిజన సంఘాలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. 1/70 చట్టం వల్ల బాక్సైట్ తవ్వకాలకు అడ్డు వస్తుందనే సాకుతోనే సవరణ చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈ చట్టానికి సవరణలు చేయాలని సభాపతి స్థాయిలో ఉన్న అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. చట్టానికి సవరణలు చేస్తే ఆదివాసీ సహజ వనరులను, ఖనిజాలను, అడవులను పెట్టుబడిదారులు, కార్పొరేట్లు స్వాధీనం చేసుకుని వ్యాపారం సాగిస్తారని, దీని వల్ల ఆదివాసీ జీవన విధానం ధ్వంసమవుతుందని పేర్కొన్నారు. టూరిజం అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరులు దోచుకుంటారన్నారు. స్పీకర్ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కిముడు రామారావు, బాకా సత్యారావు, ఓలేసి రామలింగం, ఎం.ప్రసాద్, కె.ప్రసాద్, ఎస్.శోభన్, ఎస్.బాలగంగాధరతిలక్, తౌడన్న, రమణమూర్తి, సత్యారావు, కోటేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లోకో పైలట్ల నిరసన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) కార్యాలయం ఎదుట లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైయిన్ మేనేజర్లు సంయుక్తంగా చేపట్టిన నిరసన శుక్రవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. శుక్రవారం మౌన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రెండేళ్లుగా మినిమం గ్యారెంటీడ్ కిలోమీటర్ల కోసం తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. మైలేజ్ కారణంగా ఉద్యోగులకు వచ్చే అలవెన్సులు నష్టపోతున్నామని, సమయ పాలనకు అనుగుణంగా గతంలో ఇచ్చిన విధంగా అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినిమం గ్యారెంటీడ్ కిలోమీటర్లను డ్యూటీ ప్రారంభం నుంచి 120 కిలోమీటర్లుగా నిర్ణయించి, అలవెన్సులు అందించాలని కోరారు. ఈ డిమాండ్ నెరవేరే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. డిఆర్‌ఎం సానుకూలంగా స్పందించకపోతే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్‌పై కల్లిబొల్లి మాటలొద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం కల్లబొల్లి మాటలాపి, ప్రయివేటీకరణ చేయటం లేదని వెంటనే ప్రకటించాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, విఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గింపును నిలిపివేయాలని, కాంట్రాక్టు కార్మికులందరిని రెగ్యులరైజ్ చేయాలని, ఏ షరతులు విధించకుండా స్టీల్ ప్లాంట్‌కు తక్షణమే రూ.11,440 వేల కోట్ల నిధులు వర్కింగ్ క్యాపిటల్ కింద కేటాయించాలని పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 1404వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగే వరకూ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ రోజు దీక్షలో పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి డికెఎస్.రోహిణి, ఉపాధ్యక్షులు కె.బాలనాగమ్మ, కోశాధికారి వరలక్ష్మి, కమిటీ సభ్యులు లక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో నీతి అయోగ్ సభ్యుల సమావేశం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సిరిపురంలోని విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నీతిఆయోగ్ ప్రధాన ప్రగతి చోదకాలైన ఆక్వా, ఔషధ, ఉక్కు పెట్రోకెమికల్ రంగాలపై జిల్లా అధికారులతో నీతి అయోగ్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సుబ్రహ్మణ్యం, నీతి ఆయోగ్ సభ్యులు ఎస్.కిషోర్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో స్థానికంగా లభ్యమయ్యే వనరులపైనా, అభివృద్ధికి అవకాశం ఉన్న వివిధ రంగాలపైనా చర్చించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎపిఐపిడిసిఎల్ సిఎండి పృథ్వీరాజ్, గిరిజన సహకార సంస్థ ఎమ్‌డి కల్పనా కుమారి, విఎంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్, నీతిఆయోగ్ నోడల్ అధికారి కెఎస్.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ యూత్ వైసిపి అధ్యక్షునిగా రవితేజ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ సౌత్ వైసిపి యూత్ అధ్యక్షునిగా తాడి రవితేజ నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రవితేజ మీడియాతో మాట్లాడుతూ, వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన సేవలను గుర్తించి ఈ పదవికి అవకాశం కల్పించిన వాసుపల్లి గణేష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ 30వ వార్డు ప్రెసిడెంట్ దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

చిల్లపేట చెరువు పరిశీలన



పెద్దచెరువును పరిశీలిస్తున్న వాటర్ మ్యాన్ రాజేంద్రసింగ్

ప్రజాశక్తి -తగరపువలస : పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు, వాటర్ మ్యాన్ రాజేంద్రసింగ్ శుక్రవారం చిల్లపేట, చిట్టి వలస పెద్ద చెరువును పరిశీలించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, రెండో వార్డు అధ్యక్షులు నీలాపు శంకర రెడ్డితో కలిసి చెరువును పరిశీలించారు. 36 40 ఎకరాల చెరువు గర్భం, 94 ఎకరాల ఆయకట్టు ఉన్న పెద్దచెరువు అభివృద్ధికి గతంలో రూ 1.98 కోట్లు, వైసిపి హయంలో రూ 6.50 కోట్లు మంజూరయ్యాయని శంకర రెడ్డి వారికి వివరించారు. ఈ సందర్భంగా వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్ మాట్లాడుతూ, చెరువు విస్తీర్ణం కమేణా తగ్గుతూ వస్తోందని, చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజలపై ఉందని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో చెరువులను కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నేతల విగ్రహాలకు ముసుగులు

- తొలగించిన హోర్డింగ్‌లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈనెల 27 ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటనతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోని వచ్చిన నేపథ్యంలో స్థానిక చిన్న బజారు, పాత బస్టాండ్, బ్యాంక్ కాలనీ,తగరపువలస జంక్షన్, వై జంక్షన్ తది తర ప్రాంతాల్లో ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు అధికారులు తెల్లనిగుడ్డ ముసుగులు తొడిగారు. తగరపువలస కూడలిలో ప్రధాన రాజకీయ పార్టీల హర్డింగ్‌లు తొలగించారు. ఎన్నికలల సంఘం ఆదేశాల మేరకు జివిఎంసి ఒకటో జోన్, మండలస్థాయి అధికారుల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు చేపడుతున్నారు.

జంతు సంక్షేమంపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జంతు సంక్షేమ పక్షోత్సవాల ముగింపు నేపథ్యంలో శుక్రవారం జివిఎంసి ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల ఆధ్వర్యంలో జంతు సంక్షేమంపై అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ బి వెంకటరమణ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే జంతువుల పట్ల ప్రేమ, జాలి, దయ పెంచుకుని వాటి సంరక్షణకు పాటు పడాలని సూచించారు. ఆర్.తాళ్లవలస పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్‌జి ప్రశాంతి మాట్లాడుతూ, పాడిపశువులు, జీవాలు, కోళ్లు, ఇతర మూగజీవాల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు.కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు శివకృష్ణ, శంకర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ జీబ్రా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జూ స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు జీబ్రాల ప్రాముఖ్యత, సృజనాత్మకతను క్యూరేటర్ జి.మంగమ్మ వివరించారు. జూఅసిస్టెంట్ క్యూరేటర్లుపాల్గొన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా చిన్నా

ప్రజాశక్తి- సీతమ్మధార :వైసిపి ఉత్తర నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా కొరువాడ చిన్నాను నియమిస్తూ పార్టీ కేంద్రకార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఆవిర్భావం నుంచి వైసిపిలో ఉన్న చిన్నా, పార్టీ పట్ల నిబద్ధత, చేసిన సేవలకు గుర్తింపుగా నియోజకవర్గ ఎస్‌సి సెల్ బాధ్యతలను అప్పగించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఉత్తర సమన్వయకర్త కెకె.రాజు, జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఇతర ముఖ్యనేతలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

'గీతం'లో ముగిసిన 'జెమ్ -25'

ప్రజాశక్తి -మధురవాడ : గీతం వర్సిటీ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్)25 శుక్రవారం ముగిసింది. స్టాక్ ఎక్చేంజ్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాధన్ పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు మాట్లాడుతూ భావి యువతలో నాయకత్వ లక్షణాలతో బలోపేతమే లక్ష్యంగా నిర్వహించిన జెమ్25లో కార్పొరేట్ సంస్థల నిపుణులు హజరై యువతకు దిశానిర్దేశ్యం చేశారు. వాణిజ్య అంశాలపై వర్క్‌షాపులో సమకాలీన కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళపై చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శలను అలరించాయి. కార్యక్రమంలో జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఎస్.మిశ్రా, కో సిఇఒ కె.చెర్రి హెడ్స్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరక్టర్ డాక్టర్ కె.లుబ్జా నిహార్ పాల్గొన్నారు..



జెమ్ ముగింపోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతిని ఆదుకోండి

ప్రజాశక్తి - మాధవధార : కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే చర్యలను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేపట్టాలని ఎపిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు కోరారు..ప్రోత్సాహకాల ద్వారా సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమలకు ఊతమివ్వాలని,. మధ్యతరగతిపై జీవన వ్యయ భారం తగ్గించాలని కోరారు. పన్నుల విధానం ఉదాసీనంగా ఉండాలని, .విద్యా,వైద్యం వంటి అత్యవసర ఖర్చులకు అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోతున్న మధ్యతరగతి ప్రజలకు బడ్జెట్‌లో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. దేశీ ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించి, కొత్త ఉద్యోగాలు సృష్టించేలా బడ్జెట్ రూపకల్పన చేయాలని, .దేశంలోని అన్ని విద్యా వ్యవస్థలు, శిక్షణ కేంద్రాలపై ఏకీకృత నియంత్రణ ఉండాలని, రాష్ట్రాల పరిధిలోని ఉన్నత విద్యాసంస్థలు, గ్రామీణ పాఠశాలలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, పరిశోధన సంస్థలకు ఎక్కువగా నిధులు కేటాయించి ఆదుకోవాలని మూల వెంకటరావు కోరారు.

నేడు, రేపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థాపించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా ఈనెల 1,2 తేదీల్లో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షులు జి అప్పలనాయుడు, కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కన్వీనర్ ఎం.షణ్ముఖరావు ఉత్సవ వివరాలను వెల్లడించారు. 1న శనివారం జాతీయ జెండా, శతాబ్ది ఉత్సవాల జెండా ఆవిష్కరణతో పాటు ఉత్సవాలకు గుర్తుగా పాఠశాల ఆవరణలో పైలాన్‌ను ఆవిష్కరించనున్న ట్లు వివరించారు. స్థానిక బీచ్‌లోని 'మన భీమిలి పార్కు' వద్ద పద్మభూషణ్ సర్ రతన్‌టాటా విగ్రహావిష్కరణ, 2న ఆదివారం సెయింట్ ఆన్స్ పాఠశాల క్రీడా మైదానంలో పూర్వ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహణ, విశ్రాంత ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సత్కారం ఉంటుందన్నారు. రెండ్రోజుల పాటు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రెండ్రోజుల శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలోఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో వచ్చేనెల 7నక్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణికుమారి మాట్లాడుతూ, విశాఖ నగరం కళలకు పుట్టినిల్లు అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.కళాశాల విద్యార్థులు, మహిళలు భారతీయ సంప్రదాయాలు పాటించాలని పిలుపు నిచ్చారు. ఈవెంట్ ఆర్గనైజర్ ఉషారాణి, జ్యోత్స్న, ఝాన్సీరాణి, మాధురి, మను, ఖుష్బూ, పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక పిహెచ్‌సిలో శుక్రవారం 100మంది క్షయవ్యాధి గ్రస్తులకు ప్రభుత్వపరంగా పోషకాహార కిట్లను స్థానిక వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు ఆరోగ్యసూచనలు చేస్తూ, క్షయవ్యాధి నిర్మూలనకు మందులతోపాటు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బద్రీనాథ్ నాయుడు, ల్యాబ్ అసిస్టెంట్ వాసు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఒకే రోజు రూ.అర కోటి పన్ను వసూలు

ప్రజాశక్తి- గాజువాక :జివిఎంసి గాజువాక జోన్ రెవిన్యూ విభాగం (టాక్స్) అధికారులు, సిబ్బంది శుక్రవారం ఒక్కరోజులోనే రూ. అరకోటి పన్ను వసూలు చేసి జమ చేశారు. టింపనీ స్కూల్, శ్రావణి షిప్పింగ్, ఎపిఎస్‌ఆర్‌టిసి మూడు సంస్థల నుంచి వసూలు చేసిన రూ. అరకోటి ఆదాయపు పన్ను చెక్‌ను జోనల్ కమిషనర్ శేషాద్రికి ఆర్ఒ రామ్ నారాయణ్, ఆర్ఐలు రెడ్డి మోహన్, రాజేంద్ర జోనల్ అందజేశారు.

ఆకట్టుకున్న దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శన

ప్రజాశక్తి - ఆరిలోవ : దయాల్‌బాగ్ విద్యాసంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విశాలాక్షినగర్, దయాల్‌నగర్ దయాల్‌బాగ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో వస్తు, విద్యాసంస్థ కోర్సుల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. సంస్థ జిల్లా సెక్రటరీ కె.మురళీధరరావు ప్రారంభించిన ప్రదర్శలో విద్యాసంస్థలో రోజువారీ తయారు చేసిన బ్లాక్ ప్రింటింగ్ చీరలు, జ్యూట్ బ్యాగ్స్, రుమాళ్ళు, చీరలు, దుప్పట్లు, చున్నీలు, చుడీదార్లు, గౌన్లు, నైటీస్, టాప్స్ ఆర్గానిక్ కూరగాయలు, విద్యార్థులు తయారు చేసిన ఎలక్ట్రానిక్ పరికరాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. వివిఎస్ కృష్ణ, గాయత్రి కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించి తిలకించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దక్షిణామూర్తి పాల్గొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు గోస్తనీ పాత వంతెన దిగువన శ్మశానవాటికలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తరలించాలని టిడిపి వార్డు ప్రధాన కార్యదర్శి వానపల్లి సత్య కోరారు. శుక్రవారం శ్మశానవాటికప్రాంతాన్ని పరిశీలించారు. చెత్త తరలింపులో సంబంధిత జివిఎంసి పారిశుధ్యవిభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తక్షణమే చెత్త తరలింపు చర్యలు చేపట్టకుంటే జివిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

అయోడిన్ ఆధారిత రుగ్మతలపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులకు అయోడిన్ ఆధారిత రుగ్మతలపై ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలోఅవగాహన కల్పించారు. డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ హెచ్ఎం బి.అప్పారావు, పాఠశాల కమిటీ చైర్మన్ పి.నారాయణరావు సిడిపిఒ శ్రీదేవి, డిసి సాయికృష్ణ, ప్రమీల, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తల్లిని హతమార్చిన తనయుడు

ప్రజాశక్తి -ములగాడ : అదేపనిగా ల్యాప్‌టాప్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నాడని మందలించిన తల్లిని కత్తితో కొడుకు దారుణంగా చంపిన ఘటన గురువారం రాత్రి మల్కాపురం కోస్టుగార్డ్‌లో చోటుచేసుకుంది. దీనిపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి.

మల్కాపురం ఇండియన్ కోస్టగార్డులో బల్విందర్‌సింగ్ భార్య అల్కాసింగ్ (47), ఇద్దరు కొడుకులు అనిమల్‌సింగ్, ఆయుష్మాన్‌సింగ్‌తో నివాసం ఉంటున్నారు, హైదరాబాదులోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న అనిమల్‌సింగ్ ఇటీవల ఇంటికి వచ్చాడు. రోజుకు ఆరేడు గంటల పాటు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్న కొడుకును మందలించిన తల్లి అనుష్య, అల్కాసింగ్, అతని నుంచి ల్యాప్‌టాప్‌ను లాక్కొంది. దీంతో ఆగ్రహించిన కొడుకు తల్లిని కత్తితో మెడ, ఒంటిపై పొడిచి హతమార్చాడు, తల్లి అల్కాసింగ్ పెద్ద కేకలు వేయటంతో ఇరుగుపొరుగు చూసి కోస్ట్ గార్డ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కోస్ట్‌గార్డ్ అధికారుల నుంచి సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని దాడికి గురైన అనుష్యను ముందుగా ఐఎన్ఎస్ కళ్యాణి ఆసుపత్రికి, అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. మల్కాపురం సిఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు,

నేల బావిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని సిర్లపాలెం గ్రామంలో నేలబావిలో పడి మహిళ మృతి చెందింది. సిర్లపాలెం గ్రామానికి చెందిన కోరాడ సత్యవతి (50) శుక్రవారం పశువులు తోలుకుని వెళ్ళి, తిరిగి రాకపోవడంతో ఆమె కుమారులు వెతకగా, కల్లాలు వద్ద నేలబావిలో కనిపించింది. స్థానికుల సాయంతో బయటకు తీశారు. బకెట్‌తో నీళ్ళు తీసూ ప్రమాదవశాత్తు జారి పడి ఉంటుందని భావిస్తున్నారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలి భర్త పైడి సింహచలం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి వివాహమైన కుమార్తె జయబాల, ఇద్దరు కుమారులు లక్ష్మి నాయుడు, బాలమురళి ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని లోడవానిపాలెం ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారి వద్ద నుండి 23,400 స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వాసునాయుడు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిఐ వాసు నాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ శివ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. పేకాట ఆడటం నేరమని, నిందితులపై చర్యలు ఉంటాయని సిఐ వెల్లడించారు.

కోమాలో ఉన్న రోగి మృతి


- పోలీస్‌స్టేషన్ వద్ద బంధువులు ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ: కిడ్నిలో రాళ్ళు తొలగింపునకు ఆపరేషన్ చేయించుకుని, కోమాలోకి వెళ్లిన విజయనగరం జిల్లా వేపాడ మండలం, కుమ్మపాలెం గ్రామానికి చెందిన డెక్క కృష్ణ శుక్రవారం మృతి చెందాడు. ఎంబి ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసిన వైద్యుల నిర్లక్ష్య కారణంగానే రోగి మృతి చెందాడని రోగి బంధువులు ఆరోపిస్తున్నారు. ఆరిలోవ పోలీసు స్టేషన్ వద్ద మృతుని బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టి, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మోహన్‌కుమార్‌కు ఘననివాళి

ప్రజాశక్తి- ములగాడ : ఐఎన్‌టియుసి జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ కెఎస్ మోహన్‌కుమార్ 5వవర్ధంతినిశుక్రవారం ఘనంగా నిర్వహించారు. మల్కాపురం మహలక్ష్మి థియేటర్ దరి ఆంధ్ర మోటార్ ట్యాంక్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం మోహన్ కుమార్ విగ్రహానికి ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగ విల్లి నాగభూషణం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి, కె ఈశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కలిదిండి బద్రీనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పైడినాయుడు, శ్రీనివాస్ హిందుస్థాన్ షిప్‌యార్డ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీరామమూర్తి హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్ లేబర్ యూనియన్ కార్య నిర్వాహక అధ్యక్షులు ఎస్ తాతబాబు, ఎంఇఎస్ యూనియన్ కార్యదర్శి ఎస్ అప్పన్న మజ్జి కైలాసు, సోమనాథ్, నాని పాల్గొన్నారు.

కాలుష్య కారక గొడౌన్ నిర్మాణం వద్దు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పంచవటి కాలనీ నేతలు

ప్రజాశక్తి - గాజువాక : కాలుష్య కారక బొగ్గు పొడిని నిల్వ ఉంచేందుకు అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీకి వెనుక భాగంలో విశాఖ పోర్టు నిర్మిస్తున్న గోదాములను తక్షణమే నిలుపుదల చేయాలని పంచవటి కాలనీ అసోసియేషన్ నాయకులు కోరారు. శనివారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు.ఇప్పటికే ఒక గొడౌన్ నిర్మించిన విశాఖ పోర్టు, అందులో నిల్వ ఉంచిన బొగ్గు ఎగిరి గ్రామాల్లోకి వచ్చి పడుతుండడంతో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నామని, ఇపుడు మరో గిడ్డంగి నిర్మాణం చేపడుతోందన్నారు. వెంటనే వాటిని నిలుపుదల చేసి బొగ్గు కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలని కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిఆన్నరావు, మురళి, రామ్మోహనరావు, ఇతర కాలనీవాసులు కోరుతున్నారు.

కేన్సర్ విజేతల పికిల్ బాల్ టోర్నమెంట్



కేన్సర్ విజేతలతో హెచ్‌సిజి ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ :ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరిలోవ, హెల్త్‌సిటీ హెచ్‌సిజి కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో పెదవాల్తేరు దరి ద పిక్లర్స్ హబ్‌లో శుక్రవారం కేన్సర్ విజేతలకు పికిల్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఛాంపియన్స్ పికిల్ బాల్ టోర్నమెంట్‌లో 20 మంది కేన్సర్ విజేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌సిజి కేన్సర్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిత్య కౌరా మాట్లాడుతూ క్రీడల ద్వారా ఐక్యతాభావాన్ని పెంపొందిస్తూ కేన్సర్ ఛాంపియన్‌ల వ్యక్తిగత విజయాల బలం, స్థిరత్వం, ప్రత్యేకమైన ప్రమాణాలను వెల్లడి చేయడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్, గుండెపోటుపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : కేన్సర్, గుండెపోటు ఎలా వస్తుంది, వాటికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం భీమిలి మండలం చిప్పాడ జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు నివారణ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో అవగాహన కల్పించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్య, కె ప్రకాష్, హెచ్‌ఎం, రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, విజయకుమార్ పాల్గొన్నారు

గద్దర్‌కు ఘననివాళి

ప్రజాశక్తి- సీతమ్మధార : బహుజన యుద్ధనౌక గద్దర్ జయంతిని పురస్కరించుకుని ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, గద్దర్‌పాట చైతన్యమని, ఆయన మన మధ్య లేకపోయినా తన పాటతో దశ దిశ చూపారన్నారు పాటతోనే మార్పు అనివార్యంగా వస్తుందని నమ్మే గద్దర్, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి తన పాటతో అక్కడ ప్రజలను చైతన్యవంతం చేయడానికి అహర్నిశలు కృషి చేశారన్నారు. గద్దర్ లేని లోటు ఎప్పటికీ తీరదని,ఆయన పాట నిత్యం మనతోనే ఉంటుందని కొనియాడారు.

భీమిలిలో 250 మంది ఉపాధ్యాయ ఓటర్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈనెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భీమిలి మండలంలో 250 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ భాస్కరరావు శుక్ర వారం తెలిపారు. వీరిలో 151 మంది పురుషులు, 99 మంది మహిళా ఉపాధ్యాయ ఓటర్లున్నారని వివరించారు.

కాలుష్య కోరల్లో అక్కిరెడ్డిపాలెం

- ఇప్పటికే విశాఖ డెయిరీ, శ్రావణి షిప్పింగ్ కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి
- విశాఖ పోర్టు జిపిసి గొడౌన్ల నిర్మాణంపై పరిసర ప్రజల ఆందోళన



విశాఖ పోర్టు గొడౌన్‌లో నిల్వ ఉన్న బొగ్గు పొడి

ప్రజాశక్తి -గాజువాక : కాలుష్యం కోరల్లో చిక్కుకుని అక్కిరెడ్డిపాలెం పరిసర పంచవటి టౌన్‌షిప్, మింది, రాంనగర్ తదితర గ్రామాలు అల్లాడిపోతున్నాయి. ఇప్పటికే విశాఖ డెయిరీ, శ్రావణి షిప్పింగ్, గతంలో జింకు పరిశ్రమ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందుల పడుతున్న ఇక్కడి ప్రజలకు తాజాగా విశాఖ పోర్టు నిర్మిస్తున్న బొగ్గు నిల్వల గొడౌన్‌లతో మరింత ఆందోళన చెందుతున్నారు.

మింది నుంచి షీలానగర్ వెళ్లేమార్గంలో విశాఖ పోర్టు టోల్‌గేట్ సమీపంలో ఇప్పటికే భారీగా గ్రీన్ పెట్రోలియం కోక్ (జిపిసి)నిల్వకు గొడౌన్లను నిర్మించింది. మొదటి దశలో పూర్తిచేసిన భారీ గొడౌన్‌లో నిల్వ ఉంచిన బొగ్గు పొడి ఇప్పటికే ఎగిరి వస్తూ ఆయా గ్రామాలను కాలుష్యంతో ముంచెత్తుతోంది. దాని వల్ల ఇబ్బందులు పడుతున్నామని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితుల్లో తాజాగా మరో గొడౌన్ నిర్మాణానికి విశాఖ పోర్టు పూనుకుని పనులు చేపడుతోంది. దీనిపై దాదాపు 50వేలమంది వరకు నివాసముంటున్న పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

ఇప్పటికే అక్కిరెడ్డిపాలెంలో విశాఖ డెయిరీ కాలుష్యంతో 50 మంది వరకు కేన్సర్ బారిన పడగా, అనేకమంది పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇపుడు గ్రీన్ బెల్ట్‌ను కబ్జా చేసి మరీ కొత్తగా గొడౌన్లన నిర్మాణానికి పూనుకుంది. ఇప్పటికే పరిశ్రమల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ దుర్భర జీవనం గడుపుతున్న అక్కిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి, పోర్టు గోదాముల నిర్మాణాలను నిలుపుదల చేయాలని వేడుకున్నారు. సోమవారం విశాఖ పోర్టు అధికారులను కలిసి, వారు నిర్మిస్తున్న బొగ్గు గొడౌన్లతో తమకు పొంచి ఉన్న ప్రమాదంపై విన్నవించి, గోదాములు నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరనున్నట్లు స్థానికులు వెల్లడించారు. లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగి అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు.



రెండవ గొడౌన్ నిర్మాణానికి సిద్ధం చేస్తున్న స్థలం

కాగా పోర్టుకు ములగాడ వాసులు వంద ఎకరాలు భూములివ్వగా, వారికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించకపోగా, కాలుష్యం మిగిల్చారని వాపోతున్నారు. అలాగే రోడ్ల విస్తరణ పేరుతో చెట్లన్నీ కొట్టేసి విధ్వంసం చేశారని స్థానికులు అంటున్నారు. అంతేకాక గెడ్డలను మూసేయడంతో మేఘాద్రి రిజర్వాయరులో వరద ఉధృతి పెరిగినపుడు నీరు నేరుగా సముద్రంలోకి వెళ్లకుండా ముంపునే మిగులుస్తుందని ఆవేదన చెందుతున్నారు.

భూగర్భ జలాలు కలుషితం

ఇంతకుముందు పోర్టు నిర్మించిన జిసిపి గొడౌన్ నుంచి ఎగురుతున్న బొగ్గు దుమ్ము,ధూళి కాలుష్యంతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.. నీటిలో కాలుష్య శాతం ఎక్కువగా ఉందని వారి టెస్టింగ్ రిపోర్ట్‌లో వచ్చిందని పంచవటి వాసులు వాపోతున్నారు.

గెడ్డను కప్పేసి గొడౌన్ నిర్మాణం

పాత గాజువాక నుంచి మింది, అక్కిరెడ్డిపాలెం మీదుగా షీలానగర్ టోల్ గేట్‌కు వెళ్లే గెడ్డను కబ్జాచేసి, దాన్ని మూసేసి విశాఖ పోర్టు రెండవ గొడౌన్ నిర్మిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది జరిగితే భవిష్యత్తులో ఏ కొద్దిపాటి వర్షం కురిసినా ఈ ప్రాంతంలో పలు ప్రాంతాలు నీటిముంపులోకి వెళ్లడం ఖాయమని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మురుగునీటికి అడ్డంకి ఏర్పడడంతో ఎక్కడికక్కడే నిలిచి అపారిశుధ్యం, దుర్గంధంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

తక్షణమే గొడౌన్ నిర్మాణం నిలిపేయాలి



విశాఖ పోర్టు గొడౌన్ నిర్మాణానికి తక్షణమే నిలుపుదల చేయాలి. చిన్న పరిశ్రమల్లో ఐరన్ స్పాంజ్‌కు వాడే బ్లాక్ పౌడర్ కాలుష్యంతో కూడుకున్నది. ఈ బొగ్గు ఎగిరి ఇళ్లల్లోకి చేరుతోంది.

రామ్మోహనరావు, పంచవటి టౌన్‌షిప్.

గ్రీన్‌బెల్ట్, గెడ్డల కబ్జాలతో నిర్మాణాలు



గ్రీన్ బెల్టు, గెడ్డలు కబ్జా చేసి విశాఖ పోర్ట్ ఆధ్వర్యంలో ప్రైవేటు వ్యక్తులు గొడౌన్స్ నిర్మిస్తున్నారు. ప్రమాదకరం, కాలుష్యకారకమైన బొగ్గు పొడి నిల్వ ఉంచే నిర్మాణం నిలుపుదల చేయాలి, ఇప్పటికే విశాఖ డెయిరీ, శ్రావణి షిప్పింగ్ కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఎ.లోకేశ్వరరావు, సిపిఎం జోన్ నాయకులు

అన్ని పార్టీలను కలుపుకుని పోరాటం



ఇప్పటికే గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశాము. భవిష్యత్తులో అన్ని పార్టీల సహకారంతో అందరం ప్రమాదకర బొగ్గు నిల్వలపై పోరాటం చేస్తాం.

చిన్నారావు, కాలనీ అధ్యక్షులు

తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో మహిళలకు పోటీలు



బహుమతులు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో విక్రం ప్రీమియం హైగ్రోన్ డస్ట్ టీ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. రంగవల్లులు, మ్యూజికల్‌చైర్, రింగ్ గేమ్, టీ తయారీలో నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు విక్రం టీపొడి యాజమాన్యం నిర్వాహకులు సమకూర్చిన బహమతులను అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం.తవిటయ్య, మహిళా అధ్యక్ష, కార్యదర్శులు పి.మణి, స్వప్న అందజేశారు

పెండింగ్ కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం పాత్ర కీలకమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్ అన్నారు. మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ ముగింపులో మాట్లాడుతూ, మున్ముందు మధ్యవర్తిత్వంతో రాజీ మార్గంలో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలేషన్ కమిటీ సభ్యులు సత్యారావు, ఆర్ రతన్తారాలను సత్కరించారు. శిక్షణలో విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ వెంకట శేషమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

7న ఎంఆర్‌పిఎస్ చలో హైదరాబాద్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎస్‌సిల వర్గీకరణ చట్టబద్ధతకు ఈనెల 7న చలో హైదరాబాద్ లక్ష డప్పులు, వేల గొంతులు మాదిగల సాంస్కృతిక ర్యాలీకి తరలిరవాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ, ఎస్‌సి వర్గీకరణపై ఆంధ్రా ప్రభుత్వం ముందడుగు వేసినా, తెలంగాణ సర్కారు వెనకడుగు వేస్తోందన్నారు. అక్కడి ప్రభుత్వాన్ని కదలించేందుకు చేపట్టే నిరసన ఆందోళన జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు అంజూరి దీపక్, ఎంఎస్‌పి అధ్యక్షులు కింతాడ రాజాశేఖర్, ఎంఇఎఫ్ అధ్యక్షుడు అత్తోట రవికుమార్, జాతీయ సహాయ కార్యదర్శి బోనెల లక్ష్మణరావు పాల్గొన్నారు,

రామారావు మాస్టారుకు ఘనసత్కారం



రామారావు మాస్టారును సత్కరిస్తున్న ఉపాధ్యాయ నేతలు

ప్రజాశక్తి-పద్మనాభం : ఉద్యోగ విరమణ పొందిన సబ్బం రామారావు మాస్టారును శుక్రవారం మండలంలోని కె.కొవ్వాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. సొంతూరులోని ఇదే పాఠశాలలో చదువుకుని, ఇక్కడ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి, ఇక్కడే ఉద్యోగవిరమణ చేసిన అరుదైన గౌరవాన్ని రామారావు మాస్టారు సొంతం చేసుకున్నారని, నిబద్ధతతో కూడిన సేవలు అందించారని కొనియాడారు. సబ్బం రామారావు మాస్టారు దంపతులను ఉపాధ్యాయ సంఘాల నేతలు, స్థానికులు ఘనంగా సత్కరించారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కరుణాకర్, మండల అధ్యక్షులు పెద్దరాజు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు బి సూర్యనారాయణ, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎంవివి.సత్యనారాయణ రెడ్డి, ఎస్‌టియు నాయకులు జగదీష్, రెడ్డిపల్లి హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు. పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు ఆరిలోవ, శ్రీలీలాసుందరయ్యనగర్‌లో పెద్దకాలువ పునరుద్ధరణ పనులను జివిఎంసి వర్క్స్ ఎఇఇ వెంకటరావు శుక్రవారం పరిశీలించారు. జివిఎంసి నిధులతో కాలువ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. దీనిపై సంబంధిత సిబ్బంది, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేసి,పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు.

మహిళా కార్మికుల పోరాటంతో దిగివచ్చిన బ్రాండిక్స్ యాజమాన్యం

- చలిని లెక్క చేయకుండా రాత్రంతా కొనసాగిన ఆందోళన
- అదనపు పని గంటలు పెంచబోమని హామీ
- పది రోజులలో ఇతర డిమాండ్లు పరిష్కారానికి హామీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ మహిళా కార్మికులు నిరవధిక సమ్మెతో బ్రాండిక్స్ యాజమాన్యం దిగొచ్చింది. శుక్రవారం చర్చలు జరిపి పది రోజుల్లో డిమాండ్లను పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. సమస్యల సాధనకు పలు డిమాండ్లతో గురువారం బ్రాండిక్స్ ప్రధాన గేటు వద్ద ఏ, బి షిఫ్ట్‌కి చెందిన మహిళా కార్మికులు సమ్మె బాట చేపట్టారు. గురువారం రాత్రి అంతా చలిని లెక్కచేయకుండా బ్రాండిక్స్ ప్రధాన గేటు వద్ద ఐకమత్యంగా పోరాటాన్ని కొనసాగించారు. తమ డిమాండ్లు నెరవేరేంతవరకు వెనకకు తగ్గేది లేదని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పలు శాఖలకు చెందిన అధికారులు బ్రాండిక్స్ ప్రతినిధులు చర్చలు జరపడానికి మహిళా కార్మికులను కలిశారు. ఎస్ఈజెడ్ లేబర్ కమిషనర్ రమ్య, అనకాపల్లి ఆర్డీవో ఆయేషా, పరవాడ డి.ఎస్.పి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తాసిల్దార్, కార్మిక శాఖ అధికారులు బ్రాండిక్స్ ప్రతినిధులు మహిళలతో, సిఐటియు ప్రతినిధులతో చర్చలు జరిపారు. ప్రధానమైన డిమాండ్‌గా అరగంట పని భారం పెంచబోమని హామీ ఇచ్చారు. ఆదివారం సెలవులు ఇస్తామని లైంగిక వేధింపులు, మానసిక వేధింపులు లేకుండా చూస్తామని తెలిపారు. టార్గెట్లు పేరుతో వేధింపులు చేయమని కార్మికుల అవసరాలకు సెలవులు ఇస్తామని, కార్మికులు జీతాల పెంపుదలకు యాజమాన్యంతో చర్చించి పది రోజులలో పరిష్కారం చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. మహిళల ఫిర్యాదు కొరకు ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. గోల్డ్ కాయిన్ ప్రోత్సాహకాలు, కొనసాగేసించడానికి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. చర్చలలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, అధ్యక్షులు ఆర్ శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, గనిశెట్టి సత్యనారాయణ, వివి.శ్రీనివాసరావు, కె సోమ నాయుడు, సిహెచ్ శివాజీ తదితరులు మహిళలకు మద్దతుగా చర్చల్లో చురుకైన పాత్ర పోషించారు.



కార్మికులతో చర్చలు జరుపుతున్న అధికారులు

పరవాడ ఎంపిడిఓ సస్పెన్షన్

-మద్యం సేవించి విధులకు హాజరు కావడంతో చర్యలు

ప్రజాశక్తి-పరవాడ



శ్యామ్‌సుందర్

మద్యం తాగి అధికారిక సమావేశానికి హాజరైన పరవాడ ఎంపీడీవో ఎస్.డి.శ్యామ్‌సుందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం మధ్యాహ్నం జిల్లాలోని ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు పరవాడ ఎంపీడీవో ఆలస్యంగా హాజరయ్యారు. వివిధ అంశాలపై కలెక్టర్ ప్రశ్నించినపుడు తడబడుతూ పొంతన లేని సమాధానాలిచ్చారు. ఆయన వ్యవహారశైలిపై కలెక్టర్ అనుమానించి సమావేశం జరుగుతుండగానే విచారణకు ఆదేశించారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో రవికుమార్ హుటాహుటిన స్థానిక వైద్య సిబ్బందితో పరవాడ మండల పరిషత్తు కార్యాలయానికి చేరుకుని ఎంపీడీవో నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజకుమార్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్ తదితరులు కూడా ఇక్కడికొచ్చి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఎంపీడీవో మద్యం తాగి విధులకు హాజరవ్వడమే కాక దురుసుగా ప్రవర్తిస్తుంటారని ఆ విచారణలో తేలింది. ఆ మేరకు వారు నివేదిక అందించడంతో ఎంపీడీవో శ్యామ్‌సుందర్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఈవోపీఆర్డీ ధర్మారావుకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులిచ్చారు. శ్యామ్‌సుందర్ నాలుగు నెలల క్రితమే ఇక్కడకు బదిలీపై వచ్చిన సంగతి గమనార్హం.

'బహిరంగ వేలంలో రూ.లక్షలు స్వాహా'

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రభుత్వ చెరువుల్లో చేపల విక్రయానికి బహిరంగ వేలం పాట నిర్వహించి రూ.లక్షలు స్వాహా చేశారంటూ పెదనందిపల్లి సర్పంచి సోమిరెడ్డి సన్నిబాబుపై అదే గ్రామానికి చెందిన కొంత మంది ఆరోపించారు. ఈ మేరకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోరుప్రోలు రామలింగస్వామి, పంచాయతీ వార్డు సభ్యుడు వి.రామునాయుడు, సోమిరెడ్డి అమ్మతల్లి నాయుడు తదితరులు శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన కోనేరు, భామాసాగరం, లక్ష్మీ సాగరం, కంసాల బంద, బొంతువాని బంద, నేరెళ్ల చెరువుల్లో చేపల పెంపకంతో పాటు వాటిని విక్రయించుకోడానికి 2022లో సర్పంచి నిర్వహించిన వేలం పాటలో రూ. లక్షకు పైబడి వేలంపాట సొమ్ము వచ్చిందని తెలిపారు. ఆ ఏడాది నుంచి నేటి వరకు చెరువుల మీద వస్తున్న ఆదాయం సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వ చెరువుల్ని అనధికారికంగా వేలం వెయ్యడమే కాకుండా, వాటి మీద వచ్చిన ఆదాయాన్ని స్వాహా చేసిన సర్పంచిపై విచారణ చెయ్యాలని వారు డిమాండు చేశారు. ఈ వేలం పాట విషయమై తాము సమాచార హక్కు చట్టం ద్వారా పంచాయతీ కార్యదర్శి వంతల మోదేశ్వర్రావుని సమాచారం కోరగా వేలంపాట నిర్వహించలేదని లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారని తెలిపారు.

సర్పంచి వివరణ

ప్రభుత్వ చెరువుల్ని వేలం వేసినట్టు తనపై వచ్చిన ఆరోపణల్ని సర్పంచి సోమిరెడ్డి సన్నిబాబు ఖండించారు. రాజకీయ దురుద్దేశంతో తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ప్రజల సొమ్ముని దోచుకుతినే ఖర్మ తనకు పట్టలేదని పేర్కొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించాలి



ఉపాధ్యాయులకు కరపత్రాలు ఇచ్చిన నాయకులు

ప్రజాశక్తి-యలమంచిలి

కష్టసుఖాల్లో, సమస్యల పరిష్కారంలో సంఘాలకు తోడు నీడగా నిలిచే ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఉపాధ్యాయ ఎంఎల్సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరిని గెలిపించాని పలు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు యలమంచిలి హైస్కూళ్ళ, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కాలేజీల ఉపాధ్యాయ ఓటర్లను శుక్రవారం కలిసి మద్దతు కోరారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడంలో ఎల్లప్పుడూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ముందుంటారన్న సంగతి అందరికీ తెలిసిందే. అధికార దర్పాలకు దూరంగా ఉండి, నిజాయితీగా, నిక్కచ్చిగా మండలిలో మసలు కున్న సంగతి తెలిసిందే. ప్రజాసమస్యలపై గళమెత్తే ఉత్తరాంధ్ర టీచర్ అభ్యర్థిగా పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న విజయగౌరిని గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో కోరెడ్ల రమాప్రభ, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి డాక్టర్ కె.పద్మ, జిల్లా రైతుసంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, మండల సిఐటియు కార్యదర్శి సిహెచ్ శివాజీ, ఆర్గనైజర్ పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమల్లో ప్రభుత్వ విఫలం

మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-కశింకోట

టిడిపి కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలులో విఫలమైందని వైసిపి మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు అన్నారు. కశింకోటలో వైసిపి పార్లమెంట్ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఇందులో పాల్గొన్న బొత్స, అంబటి మాట్లాడుతూ అప్పులు ఆకాశాన్ని అంటున్నాయని, రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి దిగజారిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏడు నెల పాలనలోనే సూపర్ సిక్స్ మాటకు విలువ లేకుండా పోయిందన్నారు. ఐదేళ్లలో తమ ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లు అప్పు చేస్తే, ఏడు నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం రూ.6.లక్షల 40 వేల కోట్లు అప్పుచేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. అదే సందర్భంలో సంక్షేమ పథకాలకు అడ్రస్ లేదన్నారు. కేవలం పింఛన్లు వెయ్యి రూపాయలు పెంచిందని, మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఇప్పటికీ ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చారని తెలిపారు. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి వచ్చే నెల నుండి నెలకు ఒక నియోజకవర్గం చొప్పున ఏడు నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తారని చెప్పారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు.

మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌ఛార్జిగా కరణం ధర్మశ్రీని ఎంపిక చేసి విషయాన్ని కార్యకర్తలకు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసిపి అనకాపల్లి నియోజవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ శాసనసభ్యులు కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్ రాజ్, పార్టీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, జడ్పిటిసి దంతూలూరి శ్రీధర్‌రాజు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ఆర్యభట్ట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సబ్బవరం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి ప్రథమ విజేతగా నిలిచారు. విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఐపిఎస్జిఎం- 2024 పాలిటెక్నిక్ కళాశాలల క్రీడల్లో బాలుర వాలీబాల్ టైటిల్‌ను తమ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారని పాలిటెక్నిక్ కళాశాల సెక్రటరీ సి.హెచ్. మహానాదాత నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పి.డి ప్రవీణ్, కళాశాల ప్రిన్సిపాల్ నరేష్, సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి రోటరీ క్లబ్లో ఫ్యామిలీ ఆఫ్ రోటరీలో భాగంగా రోటరీ క్లబ్ సభ్యుల పిల్లలను, సభ్యులు, తల్లిదండ్రులు విశిష్ట సేవలు చేసినవారిని వారిని రోటరీ పాలూరు చిదంబరం మెమోరియల్ హాల్‌లో శుక్రవారం ఘనంగా సత్కరించారు. పసుమర్తి శ్రీరామ్ మూర్తి, డాక్టర్ బుద్ధ మురళి సంతోష్, శ్రీధర్ నంద నితిన్, కడిమి శెట్టి శశికాంత్, పూసర్ల శక్తి, గ్రంధి సర్వారావ్‌లను ప్రముఖ ఆడిటర్ ఎస్ఎస్ శర్మ చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ రోటరీ చైర్మన్ చిత్తంబరం, అధ్యక్షులు సరిపల్లి రాజేష్, కార్యదర్శి అనిల్,డాక్టర్ శేషు కుమార్, రఘురాం జోహార్, కె సతీష్,సాన త్రినాథ్, అధిక సంఖ్యలో రోటరీ క్లబ్ సభ్యులు సభ్యుల బంధువులు మిత్రులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసు విభాగంలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పదవీ విరమణ పొందిన సిసిఎస్ అనకాపల్లి ఎస్సై వి.వి.ఎస్. ప్రసాద్, వి.మాడుగుల ఏఎస్సై జె.వి.ఆర్.ఎస్. సుబ్బరాజు, ఏ.ఆర్.ఎస్సై ఎస్.రాజబాబు, బుచ్చయ్యపేట హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు (వాలంటరీ రిటైర్మెంట్)లను జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు సత్కరించారు. అలాగే 1987 ఆగస్టు 8న చింతపల్లి మండలం లోతుగెడ్డ జంక్షన్ వద్ద మావోయిస్టుల మందుపాతర పేలుడు ఘటనలో వీరమరణం పొందిన ఏ.ఆర్.పి.సి వై.సురేంద్రరావు సతీమణి పద్మావతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఓ రామ కుమార్, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రామకృష్ణారావు, మన్మధరావు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి నుండి లంకెలపాలెం వెళ్లే రోడ్డు మరమ్మతు పనులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతు పనులలో నాణ్యతను తగ్గకుండా ఉండాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో వీలైనన్ని రోడ్లను నిర్మాణంతోపాటు బాగా పాడైన రోడ్లను మరమ్మతులు చేస్తున్నట్లుగా వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, కర్రి కనకరాజు, బంతి కోళ్ల పద్మ, పిళ్ళా జగన్మోహన్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తలకు ఎమ్మెల్యే కొణతాల భరోసా'

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కార్యకర్తలకు నేను ఉన్నానని భరోసా కల్పిస్తున్నారని జనసేన పార్టీ నాయకులు మల్ల శ్రీను తాడి రామకృష్ణ తెలిపారు. జనసేన పార్టీ సీనియర్ యువజన నాయకుడు కాండ్రేగుల ప్రసాద్ ఈ మధ్య కాలంలో తీవ్ర అనారోగ్యంతో అనకాపల్లి ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. డాక్టర్లు సీరియస్ ఉంది సుమారు ఏడు లక్షలు నుంచి ఎనిమిది లక్షల వరకు ట్రీట్మెంట్‌కు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో జనసేన 80వ వార్డ్ ఇంచార్జి మల్ల శ్రీను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన కెజిహెచ్ సూపరింటెండెంట్‌కి ఫోన్ చేసి తక్షణ వైద్యం అందించాలని కోరారు. గురువారం నాడు హాస్పిటల్ జాయిన్ చేయడం తక్షణ వైద్య సహాయం అందడంతో ప్రస్తుతం ప్రసాద్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ మేరకు అనకాపల్లి శాసన సభ్యులు రామకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అనకాపల్లి : చట్టాలపై అవగాహన, చైతన్యం పొందిననాడే ఆ చట్టాలు లక్ష్యాలు, విధి, విధానాలు ఉపయోగమని జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు అన్నారు. సమాచార హక్కు చట్టం, వినియోగదారుల హక్కు చట్టం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చట్టాలపై అవగాహన, చైతన్యం పొందడానికి సామాజికవేత్తలు అందించే పుస్తకాలను, కరపత్రాలను, క్యాలెండర్లను చదవాలని సూచించారు. సామాజికవేత్తలు, పలు సంస్థలు ఏర్పాటు చేసే సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సామాజిక స్పృహతో సామాజికవేత్త బొడ్డేడ జగ్గఅప్పారావు (జగన్) నిస్వార్థంగా చేస్తున్న కషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు ఎం.డిన్ని, ఇ.సునిల్, వి.అనిత, యు.మౌర్య పాల్గొన్నారు.

'కార్తీక్ నేచురల్ లీఫ్ ఎంటర్‌ప్రైజెస్' ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ పరిధిలోని 88వ వార్డు నంగినారపాడులో కార్తీక్ నేచురల్ లీఫ్ ఎంటర్‌ప్రైజెస్ వ్యాపార సంస్థను ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ శుక్రవారం ప్రారంభించారు. నంగినారపాడుకు చెందిన భగాది రవి, ప్రమీల స్వయం ఉపాధి కోసం దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన పేపర్, ప్లాస్టిక్ ప్లేట్లు వల్ల ఆహారంలో రసాయనాలు కలుస్తున్నాయని తెలిపారు. ఈ తరుణంలో ప్రకృతి ప్రసాదించిన విస్తరాకులతో భోజనం, అల్పాహారం, దేవుడు ప్రసాదం లాంటివి భుజిస్తే ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు కె.ఎర్నిబాబు, బొడ్డపల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి శ్రీనివాసరావు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకన్యకాపరమేశ్వరికి పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీకన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ, ప్రతిష్ట శతజయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సందర్భంగా అనకాపల్లి పట్టణంలో శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 84వ డివిజన్ కార్పొరేటర్ మాధంశెట్టి చిన్నతల్లి నీల బాబు, పోలవరపు త్రినాథ్, సూరే సతీష్, కొణతాల రత్నకుమారి, ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, ఆలయ చైర్మన్ బిళ్లపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి జగదీష్, రవి రామ్ జవహర్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

సబ్బవరం : మండలంలోని వాసవి క్లబ్ సబ్బవరం రూరల్ వాసవి కపిల్స్ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును ఆర్యవైశ్య సంఘం సభ్యులు దుస్సలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, కూటమి పార్టీల నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకట రమణ, కర్రి కనకరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా తీర్థాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కొరువాడ గ్రామంలో రాములవారి తీర్థం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుండి గ్రామస్తులు రామాలయంలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గుర్రపు పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

కశింకోట : మండలంలోని ఏఎస్.పేట గ్రామంలో శుక్రవారం వైఎస్.రాజశేఖర్ రెడ్డి తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. అనంతరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మలశాల కిషోర్ గుర్రపు పందెం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కాటాల వద్దే వారం రోజుల నిరీక్షణ

- క్యూ కట్టిన చెరుకు బండ్లు
- ఎండిపోయి దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన
- తరచూ గోవాడ సుగర్స్ మరమ్మతులతోనే ఈ దుస్థితి



బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద క్యూలో ఉన్న బండ్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఒక బండి చెరుకు పొలం నుండి గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చేరుకోవడానికి 15 రోజులు సమయం పడుతుండడంతో చెరుకు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. చెరుకు కాటాల వద్దే బండ్లు క్యూలో పెట్టి వారం రోజుల పాటు నిరీక్షించాల్సి వస్తోంది. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ తరచూ మరమ్మతులకు గురై ఆగిపోతుండడంతోనన ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో అసలే చెరకు సాగు పూర్తి తగ్గిపోయింది. అరకొరగా చేసిన సాగు చేస్తున్నా వేల రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. దీంతో లాభం కంటే నష్టమే మిగులుస్తున్న చెరకు సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. చక్కెర కర్మాగారం తరచూ మరమ్మతులకు గురికావడంతో మరింత నష్టాన్ని మిగిల్చుతుంది. ఈ ఏడాది చక్కెర కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభించిన నాటి నుండి నేటి వరకు తరచూ మరమ్మతులకు గురి కావడంతో వందల టన్నుల చెరుకు వారం రోజులకు పైగా చెరుకు కాటాల్లో మగ్గిపోతుంది. కూలీల కొరత కారణంగా ఒక బండి చెరుకు కాటాలకు సరఫరాకు సిద్ధం చేయడానికి వారం రోజులు సమయంలో పడుతుంది. అనంతరం తూనిక కాటాల వద్ద బండ్లు క్యూలో పెట్టిన తరువాత లారీల్లో లోడింగ్ అవ్వడానికి మరో వారం రోజులు పడుతోంది. దీంతో చెరకు ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు.

కొద్ది రోజులుగా బుచ్చయ్యపేట చెరుకు కాటాలో వందలాది టన్నుల చెరకు ఎండిపోతుంది. పంట పొలాల్లో వారం రోజులు, చెరుకు కాటాలో మరో వారం రోజులు ఉండిపోవడంతో ఒక బండి చెరుకు మూడు టన్నులకు పైగా వస్తుందని అనుకుంటే రెండు టన్నులకు తగ్గిపోతుందని రైతుల వాపోతున్నారు. చెరకు సాగు ఏమాత్రం గిట్టుబాటు కాకపోవడంతో మండలంలో గల రైతులు చెరుకు సాగును దాదాపు సగానికి తగ్గించేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో రైతులకు పేమెంట్లు ఇవ్వకపోవడం, చెరకు సాగు ఖర్చు అధికంగా ఉండడంతో రైతులు చెరకు సాగు పై మగ్గుచూపటం లేదు. కొంతమంది ప్రైవేట్ చక్కెర కర్మాగారాలకు చెరుకును తరలిస్తున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ఫ్యాక్టరీ మరమ్మతులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్‌గా చెరుకు క్రషింగ్ చేయాలని రైతుల కోరుతున్నారు.

తూనికకు వారం రోజులు పట్టింది



గత శనివారం చెరుకును బుచ్చయ్యపేట చెరుకు కాటాకు తీసుకొచ్చాను. ఫ్యాక్టరీ మరమ్మతులు కారణంగా ఫ్యాక్టరీకి చెరకు సరఫరా కావడం లేదు. నా బండి టోకెన్ వచ్చే సరికి వారం రోజులు పట్టింది. ఈ రోజు (శుక్రవారం) తూకం వేశారు.

- మంత్రి గణేష్, రైతు, దిబ్బిడి

ప్రతి రోజూ చెరుకు కాటాకు వెళ్తున్నాను



గత వారం రోజులుగా ప్రతిరోజు చెరుకు కాటాకు వెళ్లి వస్తున్నాను. చెరకు లోడింగ్ అవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఎప్పటి చెరుకు అప్పుడు లోడింగ్ చేయాలి.

- సీతా రమేష్, పోలేపల్లి

చెరుకు ఎండిపోతుంది



ఈ ఏడాది ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభమైనప్పటి నుండి మరమ్మతులకు గురి కావడం చెరుకు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నాం. ఫ్యాక్టరీ సక్రమంగా తిరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరకు సాగు తీవ్ర నష్టాన్ని మిగులుతుంది.

- గాడి శ్రీను, చెరకు రైతు, బుచ్చయ్యపేట

అనుమతుల్లేకుండా షాపుల నిర్మాణం

నిలిపివేయాలని ఆదేశాలిచ్చినా బేఖాతరు



అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న షాపులు ఇవే..

ప్రజాశక్తి-యలమంచిలి

ఎటువంటి అనుమతుల్లేకుండా యలమంచిలి ధర్మవరం వీధిలోని రిక్రియేషన్ క్లబ్ మూడు కమర్షియల్ షాపులు నిర్మిస్తోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొనివెళితే వాటికి పర్మిషన్ ఇవ్వలేదంటూ, ఆ షాపుల నిర్మాణాలు నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదురాజు ఆదేశించారు. ఆదేశాలను అమలు చేయాల్సిన అధికార్లు బేఖాతరు చేశారు. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా అక్కడ పనులు ఆగక పోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. పట్టపగలు కళ్ల ముందు రూల్సు అతిక్రమించి నిర్మాణాలు జరుగుతున్నా, మున్సిపల్ అధికార్లు కళ్లు మూసుకొని పాలన సాగిస్తున్నారు. రిక్రియేషన్ క్లబ్‌కు చెందిన షాపింగ్ నిర్మాణాలు నిలిపేయాలని మూడు రోజులు క్రితం ఆదేశించినా శుక్రవారం కూడా నిర్మాణాల పనులు కొనసాగడం విశేషం. అతీత శక్తులేవైనా రిక్రియేషన్ క్లబ్‌కు వత్తాలు పలుకుతున్నాయా అంటూ బాహాటంగా చర్చించుకుంటున్నారు.

గౌరీశ్వరస్వామి ఆలయంలో కల్యాణ రాట



ఆలయం వద్ద రాట వేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-చోడవరం : శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకొని చోడవరం గౌరీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కళ్యాణరాట వేశారు. ఫిబ్రవరి 26వ తేదీన జరుగు శివరాత్రి మహోత్సవానికి ముందు సుమారు వారం రోజులు పాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయి. చోడవరం ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన ఈ దేవాలయానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, మాజీ ఎంపిపి జి.వెంకట సత్యనారాయణ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు, దేవాదాయ శాఖ ఈవో సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి వెంకట్రావు, కొడమంచిలి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ నుంచి చెత్త తరలింపు

ప్రజాశక్తి- అనకాపల్లి

తుమ్మపాల మెయిన్ రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డ్ వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులపై పలు దినపత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ స్పందించారు. దీనిపై అధికారులను చెత్తను తరలించేందుకు ఆదేశించారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, ఈవోఆర్‌డి ప్రసాద్, పంచాయతీ కార్య నిర్వహణ అధికారి ఈశ్వరరావు డంపింగ్ యార్డ్ చెత్తను కాపులుప్పాడ ప్రాంతానికి లారీల ద్వారా తరలించే చర్యలు చేపట్టారు.

భూమి అప్పగించాలని తహాశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వారసత్వంగా దఖలు పడాల్సిన తమ భూమిని తమకు అప్పగించాలని బుచ్చయ్యపేట తహసీల్దార్ ఎం.లక్ష్మికి బాధిత రైతులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుచ్చయ్యపేట రెవెన్యూలో సర్వే నెంబరు 25-3, 2, 26-1లో తమ తాత సూరిశెట్టి సింహాచలం (లేటు)కు 1.55 ఎకరాల భూమి ఉండేదని, ఆ భూమి ఆయన ఐదుగురు కుమారులకు సమాన వాటాగా దక్కాల్సి ఉందని పేర్కొన్నారు. కుమారులు సూరిశెట్టి బెన్నయ్య, రమణ, తాతారావు, అప్పలకొండ, రావాలుకి సమానంగా వారసత్వంగా దక్కాల్సి ఉన్నప్పటికీ చిన్న కుమారుడైన రావాలు సంబంధిత భూమిని తన పేరిట ఆన్లైన్ చేయించుకున్నారని బెన్నయ్య, రమణ, తాతారావు, అప్పలకొండల కుమారులు, కుమార్తెలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆ భూముల ఫల సాయం అందించే వారిని, నాలుగు సంవత్సరాల నుండి ఫల సాయం కూడా ఇవ్వకుండా తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో కూడా ఈ భూమిని మళ్లీ తన పేరు రాయించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. న్యాయబద్ధంగా తమకు రావాల్సిన 31 సెంట్ల భూమిని తమకు అప్పగించాలని, రావాలు పేరిట ఉన్న పాసు పుస్తకాలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై తహసిల్దార్ లక్ష్మీ స్పందిస్తూ ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని వారికి హామీ ఇచ్చారు. తహసీల్దారును కలిసిన వారిలో సూరిశెట్టి ఈశ్వరరావు, అప్పారావు వానపల్లి లక్ష్మి, సతీష్, శ్రీనివాసు, పప్పు లక్ష్మి, దొడ్డి వరలక్ష్మి, లక్ష్మీ తదితరులున్నారు

బదిలీ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక సబ్ స్టేషన్‌లో పని చేసి బదిలీ అయిన సిబ్బందిని శుక్రవారం సాయంత్రం ఏఈఈ కర్రి శంకరరావు ఘనంగా సత్కరించారు. ఇటీవల బదిలీ అయిన అరుణ్ కుమార్, సమర్పణరావు, వరదపురెడ్డి వెంకటరావు, రొంగలి నాగేశ్వరరావు తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ ముత్యాలనాయుడు, లైన్ ఇనస్పెక్టర్ శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ జె.ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డివిఎన్ కళాశాల ఆధ్వర్యాన స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద దాడి వీరునాయుడు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛభారత్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్లాస్టిక్ డబ్బాలను, పేపర్లను, ఇతర చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ రవి చందు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎస్ఆర్ జమీర్, యు నాగేశ్వరరావు, జి సత్తిబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పిస్తాం

-పెదపేటలో అధికారుల పర్యటన -గిరిజనుల ఆందోళనకు స్పందన



విచారణ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం ఎంకే.పట్నం పంచాయతీ పెదపేట రెవెన్యూ పరిధిలో గిరిజనులు తమ గ్రామంలో ఉపాధి పని ఇవ్వాలంటూ గురువారం చేసిన ఆందోళనకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు ఆఫీసర్ పి.పూర్ణిమదేవి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.చిన్నారావు, ఎంపిడిఒ నాగేశ్వరరావు శుక్రవారం గ్రామంలో పర్యటించారు. ఆందోళన చేసిన వారందరిని పిలిపించి విచారణ చేశారు. పాంగి రాజులమ్మను విచారణ చేయగా తనకు జాబ్ కార్డు ఉందని, గత రెండు సంవత్సరాల నుండి పని ఇవ్వకపోవడంతో జాబ్ కార్డు రద్దు చేశారని చెప్పారు. తమ గ్రామం నుండి ఎంకే.పట్నం పంచాయతీకి వెళ్లాలంటే ఆరు కిలో మీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లాలని, మా గ్రామంలో 25 కుటుంబాలకి జిరాయితీ భూమి పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని, గ్రామంలో 26 మందికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్నాయని, ఊర్లో అన్ని రకాల పనులు చేయడానికి భూములు ఉన్నప్పటికీ ఉపాధి హామీ అధికారులు పని కల్పించలేదని చెప్పారు. 60 జాబ్ కార్డులు ఉండగా పనులు కల్పించకపోవడంతో 30 జాబ్ కార్డులు రద్దయ్యాయని వివరించారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.గోవిందరావు మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు కనీసం పని కల్పించకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే పని కల్పించాలని కోరారు. ప్రాజెక్టు ఆఫీసర్ మాట్లాడుతూ రద్దు అయిన జాబ్ కార్డులను పునరుద్ధరిస్తామని, జాబ్ కార్డు లేని వారికి వెంటనే జాబ్ కార్డులు ఇచ్చి రేపటి నుంచి పెదపెట రెవెన్యూ పరిధిలో ఫారెస్ట్ భూముల్లో పనులు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.



తొలగిస్తున్న సిబ్బంది

ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి- మాడుగుల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగించే కార్యక్రమానికి ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండలంలో 29 పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ నాయకులు, పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించి, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. దీంతో మండలంలో కార్యదర్శులు వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసే పనిలో పడ్డారు.

రావికమతం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలను విధిగా పాటించాలని తహసిల్దారు బి వెంకటరమణ, ఎంపీడీవో వెంకన్న బాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జనవరి 29 నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాలలో, పట్టణాలలో సమావేశాలు, రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టరాదన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలకు అనుగుణంగా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు వ్యవహరిం చాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఎన్నికల నిబంధన ప్రకారం చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.



వెండిని ఇస్తున్న దాతలు

ఆలయానికి అర కిలో వెండి వితరణ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన గెంజి జగ్గారావు, కన్నతల్లి కుమారులు గెంజి రాజేష్ కుమార్ ఉప సర్పంచ్, దంపతులు, గెంజి సుభద్రరావు దంపతులు, గంగి నరసింహమూర్తి నాయుడు దంపతులు అర కిలో వెండిని శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, రాయపురెడ్డి కొండలరావు, కోన అప్పలనాయుడు, పడాల సత్యనారాయణ, కలిమి శివ, జొన్న పల్లి నాగరాజు, కలిమి గోపాల్, పోతిన జగదీష్, జాజి మొగ్గల చిరంజీవి పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణంకు భూములు ఇచ్చిన భూదాతలకు ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ ఆ పాఠశాల ఆవరణ ఎదుట చేపట్టిన ఆందోళన శుక్రవారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన శిబిరంలో పాల్గొని మోకాళ్ళతో నిలబడి నిరసన తెలియజేస్తూ తమ సంఘీభావాన్ని తెలియజేశారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి చిన్నస్వామి మాట్లాడుతూ, భూములు ఇచ్చిన దాతలకు ఉద్యోగాలు కల్పించకుండా వేరే వారికి వారి స్థానంలో నియమించడం సరికాదన్నారు. దీక్షలు చేపట్టి ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించలేదన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-రావికమతం: ఉల్లాస్ వాలంటీర్లు గ్రామాలలో నిరక్షరాశులుగా ఉన్న వారందరినీ అక్షరాస్యలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు.మండల కేంద్రంలోని వెలుగు సమావేశం మందిరంలో వాలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని వాలంటీర్లు అందరూ బాధ్యతాయుతంగా తీసుకొని పని చేయాలని తెలిపారు. గ్రామాలలో నిరక్షరాస్యులును గుర్తించి వారికి చదువు చెప్పి అక్షరాశులుగా తీర్చిదిద్దే బాధ్యత మీపై ఉందన్నారు. ఇందు కొరకు ఉల్లాస వాలంటీర్లుకు ముందుగా శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలో డ్వాక్రా సంఘాల లో చదువుకున్న మహిళ వలంటీర్లను నియమించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జె. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సామగ్రిని అందజేస్తున ఎంపిడిఒ

హెటిరో సహకారంతో రోడ్డు పనులు



కొలతలు తీస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి:రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సూచనలు మేరకు హెటిరో డ్రగ్స్ కంపెనీ యాజమాన్యం మండలంలోని ఉపమాక మాడవీధుల్లో సీసీ రోడ్డు మంజూరు చేసినట్లు ఉపమాక వెంకన్న పాలకమండలి మాజీ చైర్మన్, క్లస్టర్ ఇంచార్జ్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. మాడవీధుల్లో రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు స్వామివారి తిరి వీధి వాహన సేవలు, స్వామివారి రథం లాగేటప్పుడు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను హోం మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లి, రోడ్డు మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు ఆమె స్పందించి హెటిరో డ్రగ్స్ కంపెనీ యాజమాన్యంకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించడంతో, కంపెనీ యాజమాన్యం స్పందించి సిఎస్ఆర్ నిధులతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు. శుక్రవారం సిసి రోడ్డు నిర్మాణానికి సంబంధించి అంచనా వేసేందుకు గాను బుజ్జి, పలువురు నాయకులు, సిఎస్ఆర్ ప్రతినిధు లతో కలిసి రోడ్డు కొలతలు తీసుకున్నారు.సుమారుగా 25 లక్షలతో 650 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను వారం, పది రోజుల్లో ప్రారంభించ నున్నట్లు బుజ్జి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధి శ్రీనివాస్, టిడిపి నాయకులు కోరుకొండ వరహాలరావు, తోలేటి శ్రీనివాస్, కొప్పిశెట్టి వాసు, గొల్లపల్లి కనక, గరగ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:పట్టణం, రూరల్ ప్రాంతాల్లో పేదలకు, గిరిజనులకు, కూలీలకు, యాచకులకు ఎస్ఏఎన్ చారిటీ ఆధ్వర్యాన శుక్రవారం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఏఎన్ చారిటీ ఫౌండర్ ఎస్ఏఎన్ కాలేజీల అధినేత సూరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ, పేదలకు అండగా నిలిచినప్పుడు కలిగిన సంతోషం మరువ లేనిదన్నారు. ఎస్ఏఎన్ చారిటీ ద్వారా భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే దుప్పట్లు, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేశామని చెప్పారు.



ఆహారం ఇస్తున్న నిర్వాహకులు



కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ లో 6 నుండి 10వ తరగతి వరకు 1968-69లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం బలిఘట్టం బ్రహ్మశ్రీ పాకలపాడు గురువు ఆశ్రమంలో ఏర్పాటు చేశారు. దీనికి సింహాచలం, జయంతి సత్యనారాయణ, నీలం రాంబాబు తదితరులు నిర్వహణా సారథ్యం వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు 55 సంవత్సరాల తరువాత మరలా కలవడంతో సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఒకరినొకరు సరదాగా ముచ్చట్లు మాట్లాడుకుంటూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఇంగ్లీష్ బోధించిన ఎవియన్ శాస్త్రి మాస్టార్‌ని సత్కరించారు.

పలుచోట్ల పశు వైద్య శిబిరాలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో శుక్రవారం చిన్న బొడ్డేపల్లి గ్రామంలో పశు వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని మద్ది. తునివలస గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు వెటర్నరీ జెడి డాక్టర్ రామకృష్ణ, ఉపసంచాలకులు డాక్టర్ ఎం చంద్రశేఖరరావు ప్రారంభించిన శిబిరంలో గర్భకొశ వ్యాధులకు చికిత్సలతోపాటు 164 లేగ దూడలు. పాడిపశువులకు,165 గొర్రెలకు,45 కోళ్ల కు మద్దిలో పశువులు 186 దూడలు, 59. కోళ్లకు నట్టల నివారణ మందులు వేశారు. రెడ్డిపల్లి, పద్మనాభం పశువైద్యాధికారులు డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ మహేష్, సుజాత సచివాలయ సిబ్బంది, సాయి తేజ, శ్రీనివాసరావు, ధర్మ తేజ, వేణుగోపాలరావు, గోపాలమిత్ర సన్యాసిరావు పాల్గొన్నారు

కశింకోట: మండలంలోని పేరంటాలపాలెం పంచాయతీ జోగారావుపేట గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం జరిగింది. కసింకోట పశువైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్సా 28 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 53 పశువులకు నట్టల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఘనంగా చలి ఉత్సవాలు ప్రారంభం

-ఉత్సాహంగా సాగిన 5కే రన్- అలరించిన ప్రదర్శనలు

ప్రజాశక్తి- అరకులోయ:చలి అరకు ఉత్సవం పండగ వాతావరణంలో ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అరకు రైల్వే స్టేషన్ నుండి 5 కె రన్ ప్రారంభించారు. అరకు చలి ఉత్సవ్ వేదికగా నిర్వహించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు అల్లరింప జేశాయి. ఉత్సవ వేదికలో జబర్దస్త్ ప్రోగ్రాంల తోపాటు, వివిధ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. విజయవాడ నుంచి కర్ర నృత్యం, దంతేవాడ జిల్లా బస్టార్ బ్యాండ్, చంపి గిరిజన దింస నృత్యం, శ్రీకాకుళం జిల్లా ఏచర్ల తప్పెటగుళు ు, మధ్యప్రదేశ్ కుటుంబ బాధ నేర్జ్, సాగర్వలస మయూరి బ్యాండ్ బాజా, చింతూరు ఐటిడిఏ కొమ్ము డాన్స్,



దప్పు వాయిద్యాలతో ప్రదర్శన చేస్తున్న కళాకారులు

పార్వతీపురం నందికొత్తల డాన్స్, విజయనగరం జిల్లా బంగర వలస జమ్ముల కల కథ, విజయనగరం జిల్లా శ్రీ రామ చెక్కభజన, తమిళ నాడు ఊటీ తోడ డాన్స్ వంటి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి, కలెక్టర్, ఐటిడిఏ పివో డాన్స్ వేసి ఆకర్షణ గా నిలిచారు.

ఉత్సవేదికలో పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ గీతాలపన చేసి అలరింపజేశారు. ఒకే వేదికలో 8 రాష్ట్రాల వివిధ ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రాంగణమంతా హర్ష ధ్వనులతో కేరింతలు కొట్టారు. ఉత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ లు చూపర్లను అమితంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవ ప్రాంగణంలోని ఫుడ్ కోర్టులో అరకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ సంప్రదాయ గిరిజన వంటకాలు అందరి దృష్టిని ఆకర్షించింది. అదేవిధంగా అంగన్వాడి కార్యకర్తలు ఆదివాసి వస్త్రధారణతో కనిపించడం అందరి దృష్టిని ఆకర్షించింది.అంతకుముందు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తో పాటు, పాడేరు ఐటిడిఏ పిఓ, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లతో పాటు, మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్నాసి, చలపతిరావు ప్రముఖ వ్యాపారవేత్త మయూరి రాజారావు సందర్శించారు, గిరిజన మ్యూజియం గోడలపై కలెక్టర్ ఇతర ఐఏఎస్ అధికారులు డ్రాయింగ్ వేసి అందరినీ ఆకర్షించారు. ఉత్సవ సందర్భంగా అరకులోయ వేదికగా



వాయిద్యాలతో కళాకారులు నృత్యాలు

నిర్వహించిన హెలికాప్టర్ రైడ్ అందర్నీ అలరింప చేసింది. 5కే రన్‌లో 300 మంది పాల్గొన్నారు.

పురుషుల విభాగంలో వి రమేష్, (గన్నెల) ప్రథమ స్థానం, డి అభిషేక్ (కిన్నంగూడ), ద్వితీయ స్థానం, సామ్యూల్ (మజ్జీవలస) తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో సెకండ్ స్టాండర్డ్ విద్యార్థిని జీవన (లిట్టిగూడ), ఎస్ మంజుల ద్వితీయ స్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ, ఐటిడిఏ పిఓ వి .అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఏఎస్పీ ధీరజ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహనరావు, విద్యార్థులు, మహిళలు, పర్యాటకులు పాల్గొన్నారు.



లేగ దూడలతో పాడి రైతులు

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మండలంలో చెట్టుపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన లేగ దూడల ప్రదర్శనకు మంచి స్పందన వచ్చింది. స్థానిక పశు వైద్యాధి కారిని డాక్టర్ కె.ప్రప్న ఆధ్వర్యంలో జిల్లా పశు ఘనాభివృద్ధి సంస్థ విశాఖ పట్నం, పశు సంవర్ధక శాఖ సౌజన్యంతో రాష్ట్రీయ గ్లోబల్ మిషన్ నిదులతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన నిర్వహంచారు. ఈ శిభిరానికి ముఖ్య అతిదిగా మాజీ డిఎల్‌డిఏ చైర్మన్ రాఘ వేంద్రరావు, జిల్లా పశు ఘనాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి బెహరా ప్రసాదరావు, నర్సీపట్నం సహాయ సంచాలకులు రాంబాబు పాల్గొన్నారు. వివిధ జాతులకు సంబందించిన 40 లేగ దూడలను ప్రదర్శించారు. పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు, ఖనిజ లవణ మిశ్రమాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సురేష్, బాల తేజ పాల్గొన్నారు.



నమూనాలను తిలకిస్తున్న మాజీ మంత్రి అవంతి

జాతీయ సాంకేతిక సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి-కోటవురట్ల:మాకవరపాలెం మండలంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ సాంకేతిక సమావేశాలను మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా ప్రారంభమయ్యాయి. సినర్జీ 2025 పేరుతో జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు 54 సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఐటి రాయపూర్ డైరెక్టర్ ఆచార్య ఎన్వి రమణ రావు, అవంతి జనరల్ సెక్రెటరీ డాక్టర్ ప్రియాంక హాజరయ్యారు, ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలలో పోటీపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలిస్తూ నైపుణ్యం సృజనాత్మకత పెంపొందించుకోవాలన్నారు, విద్యార్థులంతా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆయా రంగాలలో రాణించాలని సూచించారు, అనంతరం పలువురు ప్రముఖులను అవంతి శ్రీనివాసరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మోహన్ రావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి, మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పట్టువస్త్రాలను శుక్రవారం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల చేశారు. ఆర్య వైశ్యులు హెూమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పురవీధుల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వనిత వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘాలు పాల్గొన్నాయి.

డిఎస్‌పిగా అహ్మద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు నూతన డిఎస్‌పీగా షేక్ షాహాబాజ్ అహ్మద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఆయన చింతపల్లి డిఎస్ పిగా ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి

కెఎస్.కుమారమంగళం



ప్రచారం చేస్తున్న విజయగౌరి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కన్వీనర్ కెఎస్.కుమార్ మంగళం ఉపాధ్యాయ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మద్దిలపాలెం ప్రాంతంలో కోరెడ్ల విజయ గౌరితో కలిసి ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న నూతన విద్యా విధానం వల్ల విద్యార్థులతో పాటు అధ్యాపకులకు తీవ్ర హాని కలగబోతుందని చెప్పారు. ఇప్పటికే అనేక యాప్‌లు తెచ్చి ఉపాధ్యాయలపై పని భారాన్ని పెంచారని తెలిపారు. రేషనలైజేషన్‌తో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రమాదం ఏర్పడబోతుందన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రభుత్వమే వేజ్ బోర్డు ఏర్పాటుచేయాలని, హెల్త్ ఇన్స్యూరెన్స్, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్‌తో ముందుకు వెళు న్నామన్నారు. శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కృషి చేస్తున్నారని తెలిపారు. శాసన మండలిలో పిడిఎఫ్ బలం పెంచేందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



ధర్మశ్రీతో నాయకులు

ధర్మశ్రీని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి -చీడికాడ: ఇటీవల వైసిపి అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులుగా బాధ్యతలు చేపట్టిన కరణం ధర్మశ్రీని చీడికాడ మండలం వైసిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ధర్మ శ్రీ మాట్లాడుతూ,ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గుర్తించి ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి ప్రజల వెంట ఉండి అవసరమైతే ప్రభుత్వాన్ని నిలదీసే విధంగా పనిచేయాలని వైసిపి నేతలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చీడికాడ వైసిపి గ్రామ శాఖ అధ్యక్షుడు పరవాడ మహేష్, సిరికి బలరాం, పరవాడ నాయుడు (సిమెంట్ నాయుడు), సిరి సోలా మహేష్ పాల్గొన్నారు.

కార్మికుల ఆశలపై నీళ్లు

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ విశాఖ ఉక్కు పరిశ్రమ సందర్శనలో ప్రయివేటీకరణ నిలుపుదల, సొంత గనుల కేటాయింపు ప్రకటిస్తారని కార్మిక వర్గం భావించిందని, అయినా వారిపై నీళ్లు చల్లినట్లు పర్యటన సాగిపోయిందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్మిక వర్గాన్ని పూర్తిగా నిరాశకు గురిచేసిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉందంటూనే, ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ప్లాంట్‌కు అవసరమైన సొంత గనులు కేటాయించకుండా, సెయిల్‌లో విలీనం చేయకుండా, ఎలాంటి ఆర్థిక ప్యాకేజీ ఇచ్చినా, అది ప్లాంట్ మనుగడకు పెద్దగా ఉపయోగముండదని తెలిపారు. ఇచ్చిన ప్యాకేజీ డబ్బులు పాత అప్పులు తీర్చడానికి సరిపోతాయి తప్ప, ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకు కొనుగోలుకు ఉండవని పేర్కొన్నారు. పాత అప్పులన్నీ తీర్చివేసి ప్రయివేటుకు కట్టబెట్టేందుకే ఇటువంటి ప్యాకేజీ తీసుకొచ్చినట్లు కార్మికులు భావిస్తున్నారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించే వరకు కార్మికవర్గం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.



దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా అడవిరాజులబాబు పండగ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చీడిగుమ్మల, ఎర్రవరం గ్రామంలో శుక్రవారం అడవిరాజుల బాబు పండుగను ఆయా గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిలోవ అటవీ ప్రాంతంలో వెలిసిన అడవిరాజులబాబులను దర్శించుకోవడానికి భారీ ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా అడవిరాజులబాబులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

సొంత నిధులతో గోతులు పూడ్చివేత

సర్పంచ్ దాతృత్వంపై పలువురు ప్రశంసలు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంతంలో అసంపూర్తిగా మిగిలి ఉన్న కల్వర్టు గోతులను తన సొంత నిధులు వెచ్చించి పూడ్చారు. ప్రయాణికుల అవస్థల గుర్తించి ఆయన పనులను చేపట్టారు. గ్రావెల్ వేయించి తడిపి వెంటనే రోలింగ్ ఏర్పాటు చేశారు. నర్సీపట్నం- కృష్ణదేవిపేట ప్రధాన రహదారిపై పప్పుశెట్టిపాలెం సమీపంలో ప్రమాదకర మలుపు వద్ద ఉన్న గోతులు, గొలుగొండ ఎస్సీ కాలనీ వద్ద గోతులను సైతం పూడ్చివేయించారు. దీంతో సర్పంచ్ గోపాలకృష్ణను పలువురు అభినందించారు.



పనులు చేయిస్తున్న సర్పంచ్ గోపాలకృష్ణ